క్లుప్తంగా

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మాకవరపాలెం: అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న నాక్ సెంటర్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్, ఆపైన చదివి, 18 నుంచి 44 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 9490219717 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నర్సీపట్నం : మున్సిపాలిటీ బలిఘట్టంలో హార్ట్‌ఫుల్ నెస్ మెడిటేషన్ సెంటర్‌లో లయన్స్‌క్లబ్ నవ్య ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరంలో హైమా కంటి ఆస్పత్రి వారు వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్ ప్రారంభించారు. క్లబ్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇంకా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శిబిరానికి 256 మంది శిబిరానికి విచ్చేశారు. 54 మందిని శుక్లాల ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బేతిరెడ్డి విజయ్‌కుమార్, ట్రెజరర్ నక్క సుధీర్, వెలగా నారాయణరావు, కుప్పిలి శ్రీనివాసరావు, శ్రీరామ చినబాబు,కర్రి సత్యనారాయణమూర్తి, బోళెం వెంకటేష్, హర్షవర్ధన్, నరేష్, ప్రియాంక పాల్గొన్నారు.


బీసీ కాలనీలో పారిశుధ్యం అధ్వానం



వీధి రోడ్డును ఆనుకుని పేరుకుపోయిన చెత్త

మాకవరపాలెం : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఇక్కడి వీధిరోడ్లకు ఆనుకుని భారీ ఎత్తున చెత్త పేరుకుపోయి ఉంది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోందని, అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ చెత్త కారణంగా దోమలు మరింత వృద్ధి చెంది వ్యాధుల బారినపడుతున్నామన్నారు. వెంటనే ఈ చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రోన్‌తో వరిపంటకు కషాయాల పిచికారీ



పిచికారీ చేసేందుకు కషాయాలను డ్రోన్‌లో వేస్తున్న సిబ్బంది

మాకవరపాలెం : వరిపంటకు తెగుళ్ల సోకకుండా ప్రకృతి సేద్య పద్ధతిలో తయారు చేసిన కషాయాలను డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. మండలంలోని జంగాలపల్లిలో ఆదివారం ప్రకృతి సేద్య సిబ్బంది సుదర్శన్, రమణమ్మ జీవామృతం, జిల్లేడు కషాయం, మీనామృతం, దశపర్ణి కషాయాలను వరిపంట ఎదుగుదల, తెగుళ్లను నివారించేందుకు డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ డ్రోన్‌తో పిచికారీ చేయడం వల్ల పంటకు హాని చేసే పురుగులు మరణించడంతోపాటు పంట ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్యం సిబ్బంది సత్యవేణి, నాగలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను కలిసిన బూత్ అధ్యక్షుడు



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న బూత్ అధ్యక్షుడు నాయుడుబాబు

నర్సీపట్నం : నియోజకవర్గం నాతవరం మండలం బూత్ అధ్యక్షుడుగా నియమితులైన అడిగర్ల నాయుడుబాబు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను పార్టీ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యేకు దుశ్శాలువ కప్పి, జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాతవరం వైస్ ఎంపీపీ పైల సునీల్, మండల యూత్ అధ్యక్షుడు బండారు పైడియ్యానాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెలుగుల పండగకు వేళాయె...

- బాణసంచా అమ్మకాలతో సందడి
- ఆకట్టుకునే డిజైన్లలో ప్రమిదల విక్రయాలు



చోడవరం పట్టణంలో హైస్కూల్ గ్రౌండ్‌లో సందడిగా ఉన్న బాణసంచా విక్రయ దుకాణాలు



రకరకాల డిజైన్లతో ప్రమిద దీపాల వెలుగులు

చోడవరం : దీపావళి పండగ శోభతో గ్రామాలన్నీ సందడిగా మారాయి. అమావాస్య చీకట్లు పారద్రోలి జీవితాల్లో కొత్త వెలుగు నింపుకోవాలనే ఆకాంక్షతో దీపావళి పండగను ఘనంగా జరుపుకొనేందుకు ప్రజలంతా ఎంతో ఉత్సాహంతో ఒకరోజు ముందు నుంచే అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం దీపావళి కావడంతో ఆదివారం మార్కెట్ అంతా సందడి నెలకొంది. చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు వ్యాపార కేంద్రమైన చోడవరం పట్టణం పండగ శోభతో సందడి చోటు చేసుకుంది. ఒక పక్క బంగారం, వస్త్ర దుకాణాలు కొనుగోలు అమ్మకాలతో హడావుడిగా ఉండగా, అమావాస్య చీకట్లో వెలుగులు జిమ్మే బాణసంచా దుకాణాలు మరీ కిటకిటలాడాయి. చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో బాణాసంచా విక్రయ కేంద్రాలు ఒకే చోట ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతమంతా అమ్మకాలతో హడావుడి నెలకొంది. ఈ ఏడాది వస్తువుల ధరలు కొంత పెరిగినప్పటికీ సంబరాలకు మాత్రం ఎవరు తగ్గలేదు. రెట్టించిన ఉత్సాహంతో సంబరాలు అంబరాన్ని అంటే విధంగా బాణాసంచాలు కొనుగోలు చేస్తున్నారు. మట్టి ప్రమిదలు, కొవ్వొత్తుల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి. ఆదివారం మధ్యాహ్నం వర్షం కురవడంతో మందుగుండు అమ్మకాలకు చాలా ఇబ్బంది ఏర్పడింది. మరోపక్క ఇళ్లు, షాపింగ్‌లు, ఆలయాలు అన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో కనువిందు చేశాయి. పండ్లు, పువ్వులు, చెరకు గెడలు, పూజాసామాగ్రి దుకాణాలతో పట్టణంలోని మెయిన్‌రోడ్డు, చినబజార్ వీధి, గవరవరం రోడ్డు, పాత బస్టాండ్ జంక్షన్లు జనంతో రద్దీగా మారాయి. చోడవరం, గోవాడ,వెంకన్నపాలెం, జుత్తాడ, గవరవరం, నర్సాపురం తదితర గ్రామాల్లో దీపావళి సంబరాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బాణసంచా అమ్మకాలకు వరుణుడి దెబ్బ

నర్సీపట్నం : దీపావళి పండగకు రెండు రోజుల ముందు నుండే నర్సీపట్నం పెద్దచెరువు వద్ద దుకాణాలు వెలిసాయి. ఆదివారం అమ్మకాలు బాగుంటాయని వ్యాపారులు భావించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యాపారులు వాటిని పరిరక్షించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాతావరణం అనుకూలిస్తే ఆదివారం అమ్మకాలు బాగుంటాయని అందరూ భావించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం పడుతూనే ఉంది. వర్షానికి మందుగుండు సామాగ్రి తడిసిపోకుండా టార్పాలిన్లు కప్పేందుకు నానాతంటాలు పడ్డారు. వర్షం కురుస్తుండడంతో కొనుగోలుదారులు కూడా రాకపోవడంతో వ్యాపారులు దిగాలు పడ్డారు.



బాణసంచా తడిసిపోకుండా టార్పాలిన్లు కప్పిన వ్యాపారులు

వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీల ఎంపిక



పాతమల్లంపేటలో కమిటీ ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ నాయకులు

గొలుగొండ : గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల వల్ల పార్టీ బలోపేతం అవుతుందని వైఎస్సార్‌సీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. పాతమల్లంపేట, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీ ఎంపిక ఆదివారం నిర్వహించారు. ఈ రెండు పంచాయతీల పార్టీ పరిశీలకులు గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు(బుజ్జి) ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగిందన్నారు. నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో ఈ కమిటీ బాధ్యతలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పప్పుశెట్టిపాలెం సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

ఈ చెత్తతో ఇంకెన్నాళ్లు సావాసం..



చెత్తకుప్పల వద్ద నిరసన తెలుపుతున్న ఎస్సీ కాలనీ వాసులు

రావికమతం : రావికమతం ఎస్సీ కాలనీ పక్కనే ఉన్న డంపింగ్ యార్డుని తలపించేలా ఉన్న చెత్త కుప్పలను వారం రోజుల్లో ఖాళీ చేయిస్తామని మండల అధికారులు చెప్పారు. అయితే రెండు వారాలు గడిచినా ఇప్పటికీ చెత్త తొలగించలేదు. వర్షాలకు కుళ్లిన చెత్త నుంచి వచ్చే కంపును భరించలేకపోతున్నాం. ఇంకా ఎన్నాళ్లు మాకు ఇబ్బందులు అంటూ ఎస్సీ కాలనీవాసులు ఆదివారం నిరసనకు దిగారు. రావికమతంకు డంపింగ్ యార్డ్ లేకపోవడంతో ఊర్లో సేకరించిన చెత్త అంతటినీ ఆర్‌ఈసీ రోడ్డు పక్కన, ఎస్సీ కాలనీని అనుకొని ఉన్న ఖాళీ స్థలంలో గుట్టలుగా పడేస్తున్నారు. నెలలు తరబడి తొలగించకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో దుర్గంధం వ్యాపిస్తోంది. చెత్త కుప్పలను అక్కడ నుంచి ఖాళీ చేయించాలని గత నెలలో ఆందోళన చేయడంతో ఎంపీడీవో మహేష్ స్పందించి వారం రోజుల్లో చెత్త కుప్పలను అక్కడి నుంచి తొలిగిస్తామని హామీ ఇచ్చారు. అయితే రెండు వారాలు దాటినా ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. అధికారులు, పంచాయతీ పాలకులు స్పందించి చెత్త కుప్పలను అక్కడ నుంచి తొలగించకుంటే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, కాలనీవాసులు హెచ్చరించారు.

పోటీతత్వంతో ప్రతిభకు వెలుగు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నారాయణ రావును సత్కరిస్తున్న డాక్టర్ రామచంద్రరావు



పదో తరగతిలో చదువుల్లో ఉత్తమ ప్రతిభను చూపుతున్న విద్యార్థులకు ప్రతిభా పురస్కారం

కె.కోటపాడు : గ్రామీణ ప్రాంతాల్లో చదువులు సాగిస్తున్న ప్రతి విద్యార్థి పోటీతత్వంతో మెరుగైన ఫలితాలు సాధించాలని సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, ఈఎన్‌టీ వైద్యుడు బండారు రామచంద్రరావు అన్నారు. గొండుపాలెం గ్రామంలో ఆదివారం సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం పదో తరగతి చదువులు సాగిస్తున్న విద్యార్థుల్లో టాపర్లుగా ఉన్న 32 మందికి ఒక్కొక్కరికి రూ.2వేల నగదుతో పాటు ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. ఈ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న గొండుపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎల్.వి. నారాయణరావు, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని పొందిన కె.కోటపాడు హైస్కూల్‌కు చెందిన ఎం.మురళీకృష్ణ, బి.అప్పలనాయుడు, ఆర్. దేముడుబాబు, కె.బంగారయ్య, కె.దండునాయుడు, వి.శ్రీనివాసరావు, ఎస్.కోటలక్ష్మిలకు జ్ఞాపికను అందించి సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే పుట్టి పట్టణాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న కొంత మంది సంఘమిత్ర సొసైటీని స్థాపించి 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సొసైటీ ద్వారా ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్టు తెలిపారు. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సంఘమిత్ర సొసైటీ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పద్మపూజిత ఆటో ఫైనాన్స్ ఎండీ శ్రీనివాస బసవరాజు మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలు ఉన్నతమైనవిగా ఉండాలని, వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు పట్టుదలతో చదువులు సాగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘమిత్ర ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతి, సూర్రెడ్డి శ్రీనివాసరావు, లెక్కల గోపి, బండారు మంగపతి, బండారు వెంకట రమణమూర్తి, సూర్రెడ్డి బాబూరావు, యడ్ల గోవింద పాల్గొన్నారు.

పండగ పూట వర్షం...జనజీవనం అస్తవ్యస్తం



వర్షంలో వడ్డాది సంతలో గొడుగులు వేసుకుని కొనుగోలు చేస్తున్న ప్రజలు



బీఎన్ రోడ్డులో వడ్డాది పెద్దేరు డైవర్షన్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నీటిలో నుండి వెళ్తున్న లారీ



బొడ్డేరు నుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలంలో ఆదివారం వర్షం దంచి కొట్టింది. వర్షంతో దీపావళి పండగకు పట్టణ ప్రాంతాల నుండి పల్లె గ్రామాల తమ ఇళ్లకు వస్తున్నవారితో పాటు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంతో రోడ్లపై పడ్డ పెద్ద పెద్ద గోతుల్లో నీరు చేరి రోడ్లు చెరువులను తలపించడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒక పక్క జోరువాన, మరో పక్క అడుగడుగునా ఏర్పడ్డ గోతులతో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయ పడుతూ వాహనదారులు ప్రయాణాలు సాగించారు. వడ్డాదిలో ఆదివారం సంత రోజు కావడంతో జోరువానలో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. పలువురు బాణసంచా అమ్మకందారులు దుకాణాలు వేయడం మానుకున్నారు. భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో వడ్డాది పెద్దేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డుపై నుంచి నీరు ప్రవహించింది. అయితే వాహనదారులు భయపడుతూనే నీటిలో నుంచి రాకపోకలు సాగించారు. పెద్దేరు, తాచేరు, బొడ్డేరు నదులు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ఉధృతంగా గెడ్డలు

మాడుగుల రూరల్: మండలంలో భారీ వర్షంతో నదుల్లో నీరు చేరుతోంది. శనివారం రాత్రి నుంచి వర్షం ఏకధాటిగా కురవడంతో తాచేరు, శారదనది, పాలగెడ్డ, చింతగెడ్డల్లో నీరు చేరింది. దీంతో ప్రధాన రహదారులు చిత్తడిగా మారాయి. ఆదివారం ఉదయం నుంచి వర్షం చెదురుమదురుగా కురిసింది. ఈ వర్షం వల్ల పల్లపు భూముల్లో వేసిన వరి పంట నీట మునిగింది.

గొలుగొండలో వర్షం

గొలుగొండ : మండలంలో ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట, గొలుగొండ, పాతమల్లంపేట, కొత్తమల్లంపేట తదితర గ్రామాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. అలాగే ఆదివారం ఉదయం గంటపాటు కురిసిన వర్షం కారణంగా దారగెడ్డ, బోరింగ్ గెడ్డ, గొర్రి గెడ్డల నుండి తాండవ జలాశయానికి నీరు ప్రవహించడం జరిగింది. దీని వల్ల తాండవ జలాశయం నీటి మట్టం రోజురోజుకి పెరుగుతుంది. గడిచిన వారం రోజులు ఎండల అనంతరం వర్షం కురవడం వల్ల వరి పంటకు మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు.



బంగారుమెట్ట వద్ద గోతుల్లో చేరిన వర్షం నీరు



పేటలో పొంగి ప్రవహిస్తున్న తాచేరు నది



పాలగెడ్డలో చేరిన వర్షపు నీరు

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఏకగ్రీవం



మండల శాఖ అధ్యక్షుడు కుమార్



మండల శాఖ కార్యదర్శి రొంగలి రాము

నాతవరం : ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా ఎస్.వి.ఎన్.పి. కుమార్, మండల శాఖ కార్యదర్శిగా రొంగలి రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో మర్రిపాలెం ఎంపీపీ పాఠశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ సర్వ సభ్య సమావేశం రాష్ట్ర కౌన్సిలర్ కూండ్రపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను యూనియన్ రాష్ట్ర జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఆర్.వరహాలబాబు వ్యవహరించారు. మండల శాఖ అధ్యక్షుడిగా లింగంపేట పాఠశాలలో పని చేస్తున్న ఎస్.ఎస్.పి. కుమార్‌ను, కార్యదర్శిగా పి.జగ్గంపేట పాఠశాలలో పని చేస్తున్న రొంగలి రామును మరి కొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కూండ్రపు సత్యనారాయణ, జిల్లా నాయకుడు నూకరాజు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎస్.వి.సత్యనారాయణ, శ్రీరామమూర్తి ఘనంగా సత్కరించారు.

సుపథ ప్రతిభా పరీక్షలకు 391 మంది హాజరు



దేవరాపల్లి సుపథా ప్రతిభా పరీక్షలలో విజేతలకు బహుమతులను అందజేసిన నిర్వాహకులు

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సుపథ ప్రతిభా పరీక్షలకు మండలంలోని 8 పాఠశాలల నుంచి 391 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరమ గురువు, సంఘ సంస్కర్త కృష్ణమాచార్యులు శత జయంతోత్సవాలను పురస్కరించుకొని ఈ పోటీలను నిర్వహించారు. మాతృభాష వృద్ధి, భారతీయ సంస్కృతి, సంస్కారం, మానవతా విలువలను విద్యార్థి దశ నుంచే పెంపొందించడానికి గత 22 ఏళ్లుగా సుపథ సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలలో తెలుగు నేర్చుకుందాం, పద్య పఠనం, శ్లోక పఠనం, గేయ, వ్యాసరచన, శ్రీమద్రామాయణం క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సుపథ వ్యవస్థాపకుడు వి.వి.ఎ.ఎన్. రాజు, సోషల్ టీచర్ ఎల్. సత్యనారాయణ, ఎ.వి.ఎస్. ప్రకాశం మాట్లాడుతూ విద్యార్థుల్లో మానవతా విలువలను ఆవశ్యకతను, సుపథ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం



కోటి సంతకాల సేకరణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని కూటమి ప్రభుత్వం కుతంత్రాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం రాత్రి మండలంలోని నాగవరంలో కోటి సంతకాల సేకరణ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విద్య, వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు. వాటిలో 7 కళాశాలల నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని ప్రైవేటుపరం చేసేందుకు కుతంత్రాలకు పాల్పడడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో ఆందోళనలు తీవ్రతరం చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కాండ్రేగుల జగన్, మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు, గనిశెట్టి వెంకట్, గెంజి రమణ, అప్పికొండ శ్రీనివాసరావు, అప్పికొండ సంతోష్, కాంతమ్మ, సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసన



సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న డీహెచ్‌పీఎస్

నర్సీపట్నం : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్ మీద దాడి చేసిన వ్యక్తిని తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పీఎస్) గౌరవ అధ్యక్షులు డాక్టర్ డి.సిహెచ్.రాజుబాబు డిమాండ్ చేశారు. చీఫ్ జస్టిస్‌పై దాని ఖండిస్తూ ఆదివారం అబిద్ సెంటర్‌లోని నిరసన తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దాడి చేసిన వ్యక్తిని తక్షణమే శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో పి.కృష్ణ, మహాలక్ష్మి, పెంటకోట సత్తిబాబు, హరిబాబు, లోవరాజు, శివ, అప్పారావు పాల్గొన్నారు.

పెదగొలుగొండపేటలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి లావణ్య

నాతవరం : వైద్యాధికారులు సూచనలు పాటిస్తే కాలానుగుణంగా వచ్చే వ్యాధులను నివారించవచ్చునని వైజాగ్‌కు చెందిన డాక్టరు లావణ్య అన్నారు. మండలంలో పెద గొలుగొండపేట గ్రామంలో ఆదివారం హోమియోపతి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. ఈ శిబిరంలో సుమారుగా 129 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యాధులు రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరం ఏర్పాటుకు కావలసిన సదుపాయాలు వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్‌శాఖ విభాగం మండల శాఖ అధ్యక్షుడు పెద గొలుగొండపేట సర్పంచ్ మిరపల వెంకటరమణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉలబాల గంగునాయుడు, పైల సత్యనారాయణ పాల్గొన్నారు.

భజన పోటీలకు 60 బృందాలు



విలేకరులతో మాట్లాడుతున్న భజన పోటీల నిర్వాహకుడు గండి సింహాద్రి

రోలుగుంట : ఈ నెల 22 నుంచి కుసుర్లపూడి గ్రామ సమీపంలో గల బాబా ఆశ్రమం వద్ద జిల్లా స్థాయి భజన పోటీలు జరగనున్నాయి. అందుకోసం జిల్లాలో గల వివిధ మండలాల నుంచి 60 బృందాలు తమ కమిటీ వద్ద నమోదు చేసుకున్నాయని నిర్వాహకుడు గండి సింహాద్రి తెలపారు. ఏ బృందం ఎవరితో పోటీలో పాల్గొనున్నాయో ఈ నెల 18న శనివారం బాబా ఆశ్రమంలో డ్రా తీయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 22 నుంచి ఈ పోటీలు నిర్వహించి ఫైనల్‌కు చేరిన వారికి వచ్చే నెల 2,3,4 తేదీల్లో ఫైనల్స్ నిర్వహించి, 5న ఎంపికైన విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు. డ్రా తీసిన విధంగా ఆయా భజన బృందాల్లో పోటీల్లో పాల్గొనాలని కోరారు.

నవంబర్ 3న శూలాల మహోత్సవం



మాట్లాడుతున్న సాంబశివ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

మునగపాక: నవంబర్ 3వ తేదీన మునగపాకలో శూలాల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సాంబశివ ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు కోరారు. ఆదివారం స్థానిక ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. స్థానికులు పలు సూచనలు, సలహాలు అందించారు. ఆయన మాట్లాడుతూ ఏటా కార్తీకమాసంలోని రెండో సోమవారం మునగపాక శూలాల మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఏడాది గ్రామ పెద్దల సహకారంతో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఉత్సవం సందర్భంగా ప్రధాన కూడళ్లలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేలా ముందుకు రావాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, పెద్దలు టెక్కలి పరశురామ్, దాడి శ్రీరామమూర్తి, కుంది సూర్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.